సమ్మర్ క్యాంప్ ప్రారంభం



కూకట్‌పల్లి: ఏఎస్ రాజు నగర్ వెల్ఫేర్ కమ్యూనిటీ హాల్‌లో ఏకే స్టెమ్ నిర్వాహకులు సందీప్ చాంద్, ట్రైనర్ ఇషాంత్, స్పోర్టింగ్ మెంబర్‌లు వసంత్, శ్రీనాథ్ ఆధ్వర్యంలో రోబోటిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సమ్మర్ క్యాంపును శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్ రాజు నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని ప్రారంభించిన ఎంఈఓ హరిచందర్

మోతీనగర్: విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు వేసవి శిక్షణా శిబిరాలు దోహదపడతాయని ఎంఈఓ హరిచందర్ అన్నారు. శుక్రవారం బాలానగర్‌లోని జడ్పీహెచ్ఎస్, బబ్బుగూడలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో వేసవి శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిబిరంలో స్పోకెన్ ఇంగ్లిష్, స్టోరీ టెల్లింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఫిజికల్ వెల్‌నెస్ యాక్టివిటీస్, యోగా, ఇండోర్ గేమ్స్, మెడిటేషన్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, మెహందీ, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్‌లను విద్యార్థులకు నేర్పిస్తున్నట్లు తెలిపారు. 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వకులా దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ముస్లింల ర్యాలీ



ఆల్విన్‌కాలనీ: కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిని నిరసిస్తూ ఎల్లమ్మబండలో శుక్రవారం ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. నమాజ్ అనంతరం ఎల్లమ్మ బండ చౌరస్తాలోని మిస్సైల్ మెన్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేశారు. జాతీయ జెండాలను చేత పట్టుకొని పాకిస్థాన్ డౌన్ డౌన్, హిందుస్థాన్ జిందాబాద్.. హిందూ, ముస్లిం బాయి బాయి అంటూ నినాదాలు చేశారు. మతంపై ద్వేషం నింపుకొని దాడులు చేయటం దారుణమన్నారు. దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాలని, ఈ దాడులకు బాధ్యులైన తీవ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ముస్లిం యువకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

కార్మికుడి అదృశ్యం



జోగి (ఫైల్)

మూసాపేట: కూకట్‌పల్లిలోని భవన నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న వ్యక్తి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్ రాష్ట్రం రవిదాస్‌పురా గ్రామానికి చెందిన జోగి (56) కూకట్‌పల్లిలోని హానర్ భవన నిర్మాణ సంస్థలో కార్మికుడిగా పనిచేసున్నాడు. ఏప్రిల్ 27న రాత్రి 7 గంటలకు బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మూసాపేట: పుల్లారెడ్డి 11కె.వి. ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ భీమలింగప్ప తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి 9:30 గంటల వరకు బాలాజీనగర్, సాయిబాబా నగర్, రామ్‌దేవ్‌రావ్ హాస్పిటల్, వివేక్‌నగర్, కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్, బాలాజీనగర్ ఒమిని ఆసుపత్రి వెనుక ప్రక్కన, ఉదయం 9:30 నుంచి 10 గంటల వరకు పుల్లారెడ్డి కాంపౌండ్, సేవాలాల్ నగర్, మెజెస్టిక్ విల్లాస్ ప్రాంతాల్లో, ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు కేపీహెచ్‌బీ 7వ ఫేజు, కేపీహెచ్‌బీ వాటర్‌వర్క్స్ ప్రాంతాల్లో, మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డు, ఎస్పీ నగర్, అంబేడ్కర్ నగర్, న్యూ బాలాజీనగర్, వివేక్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అర్హులెవరో..?

రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
దరఖాస్తుల పరిశీలన షురూ.. వడపోతపై ప్రత్యేక దృష్టి

- మండల, పట్టణ స్థాయి కమిటీలకు కన్వీనర్‌గా ఎంపీడీఓ/కమిషనర్
- జిల్లాస్థాయి కమిటీకి కన్వీనర్‌గా కలెక్టర్, మరో 8 మంది సభ్యులు
- వచ్చిన దరఖాస్తులు : 66,648, జిల్లాకు మంజూరైన యూనిట్లు: 24,610



జవహర్‌నగర్‌లోని మీ సేవా సెంటర్‌లో దరఖాస్తు చేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికకు దరఖాస్తుల వడబోత మొదలైంది. ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు అర్హుల జాబితాను రూపొందించేందుకు సంబంధిత శాఖల అధికారులతో మండల/పట్టణ, జిల్లాస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసింది. ముందుగా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల వారీగా విభజించారు. వీటిని సంబంధిత అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా, ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

కమిటీల పర్యవేక్షణలో..

మండల, పట్టణ స్థాయిలో పురపాలక కమిషనర్/ఎంపీడీఓ కన్వీనర్‌గా, మండల ప్రత్యేకాధికారి, సంబంధిత కార్పొరేషన్లకు చెందిన అధికారి, బ్యాంక్ మేనేజర్, డీఆర్డీఏ నుంచి ఒకరిని సభ్యులుగా నియమించారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ కన్వీనర్‌గా 8 మంది వివిధ శాఖల అధికారులతో పాటు బ్యాంక్ అధికారి సభ్యులుగా ఉంటారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులు పరిశీలిస్తారు. దరఖాస్తుదారులు గత ఐదేళ్లుగా కార్పొరేషన్ల నుంచి రుణాలు తీసుకున్నారా..? ఆ కుటుంబంలో ప్రభుత్వోద్యోగులు ఉన్నారా..? వారి ఆర్థిక స్థితిని పరిశీలించి మండల కమిటీకి నివేదిస్తారు. పట్టణాల్లో (పురపాలక సంఘాల్లో) వార్డు అధికారులు దరఖాస్తులను పరిశీలించి పట్టణ కమిటీలకు అందజేస్తారు. అక్కడి నుంచి జిల్లా కమిటీకి జాబితాను పంపిస్తారు. లబ్ధిదారుడు ఎంచుకున్న యూనిట్లను అనుసరించి రాయితీలు అందనున్నాయి. రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు రుణాలు అందించనున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని కమిటీల పర్యవేక్షణలోనే పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

శాఖలు	దరఖాస్తులు	యూనిట్లు
బీసీ,ఈబీసీ	37,935,	13,400
ఎస్సీ	16,300,	6,201
ఎస్టీ	2,196,	1,594
మైనార్టీలు, క్రిస్టియన్లు	10,217,	3,415.

బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, నిర్వాహకురాలు అరుణ అశోక్

ఆల్విన్‌కాలనీ: గద్దర్ అన్న ఐకాన్ అవార్డు -2025 బ్రోచర్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. శనివారం బీఎం బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు ఉపద్రష్ట అరుణ అశోక్ తెలిపారు. సాయి అలేఖ్య సాంస్కృతి సంఘ సేవ సంస్థ ఆధ్వర్యంలో, చైతన్య కళానికేతన్ జగద్గిరిగుట్ట వారి ఆశీస్సులతో, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో 'జానపదం- మా ప్రాణపదం' పేరుతో కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పలువురికి అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- వైన్‌షాపు పర్మిట్‌రూమ్‌లో గొడవ
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



మృతి చెందిన ధనుష్ గౌడ్ (ఫైల్)

మూసాపేట: వైన్‌షాపు పర్మిట్ రూములో జరిగిన చిన్నపాటి గొడవ ఓ యువకుడి ప్రాణాలను బలితీసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజుల రామారానికి చెందిన ఆకుల ధనుష్ గౌడ్ (20) ఓ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. పరీక్షలు ముగియటంతో ఏప్రిల్ 5న తన స్నేహితులు అభినవ్ గౌడ్ (22), నాగిరెడ్డి(21)లతో కూకట్‌పల్లిలోని దారువాలా వైన్ షాపులో మద్యం తాగడానికి వెళ్లారు. కావటి కేశవ్ (25) మూసాపేటలో ఉంటూ బ్లింకిట్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కావటి కేశవ్ కూడా తన స్నేహితులతో పర్మిట్ రూములో మద్యం తాగుతున్నారు. అతడిని కొంచెం పక్కకు జరగాలని ధనుష్ గౌడ్ స్నేహితులు కోరారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి తారస్థాయికి వెళ్లింది. కావటి కేశవ్ ధనుష్ గౌడ్, అతని స్నేహితులను పిడిగుద్దులు గుద్దాడు. ధనుష్‌గౌడ్‌కు కడుపులో బలంగా తగలటంతో అక్కడి నుంచి బయటకు వెళ్లారు. మరుసటి రోజు ఉదయం కడుపు నొప్పిగా ఉందంటూ వాళ్ల అమ్మకు చెప్పటంతో వెంటనే కేపీహెచ్‌బీ కాలనీలోని రెమెడీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అత్యవసర చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తీసుకెళ్లాలని సూచించారు. నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. పెద్ద పేగు పగిలి ఇన్‌ఫెక్షన్ అయ్యిందని వైద్యులు తెలిపారు. సర్జరీ చేయగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా కావటి కేశవ్‌ను శుక్రవారం అరెస్టు చేశారు.

వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా 10 కేంద్రాలను ఎంపిక చేశారు. ఈనెల 1న ప్రారంభమైన శిబిరాలు జూన్ 6 వరకు కొనసాగనున్నాయి. 14 ఏళ్ల లోపు బాలబాలికలకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు కొనసాగుతుందని జిల్లా యువజన, క్రీడల అధికారి జీవీ గోపాల్‌రావు తెలిపారు. శిక్షకులకు సంబంధిత క్రీడా సామగ్రి తోపాటు గౌరవ వేతనం ఇస్తున్నామన్నారు.

8 రూరల్, 15 అర్బన్ కేంద్రాల్లో శిక్షణ

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 8 రూరల్, 15 అర్బన్ కేంద్రాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభించినట్లు గోపాల్‌రావు తెలిపారు. తూంకుంట, శామీర్‌పేట, మునీరాబాద్, తుర్కపల్లి (2 కేంద్రాలు), ఉద్దమర్రి, అద్రాసుపల్లి, కోల్తూర్, మజీద్‌పూర్, జీడిమెట్ల, చింతల యాద్గార్‌పల్లి, చౌదరిగూడ, జోడిమెట్ల, మేడ్చల్, కొర్రెముల, కీసర, కొకూర్‌ల్లో వాలీబాల్, నెట్‌బాల్, ఖోఖో, హ్యాండ్ బాల్, బాక్సింగ్, అథ్లెటిక్స్, కబడ్డీ తదితర ప్రాథమిక శిక్షణ ఇస్తారన్నారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగించడంతో పాటు, ప్రతిభావంతులను గుర్తించి వారిని రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధం చేయాలనే లక్ష్యంతో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

జూన్ 3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

సాక్షి,సిటీబ్యూరో: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు జరగనున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వాల్యూవేషన్ ఫలితాల కోసం వేచి చూడకుండా, సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే వారు ఈనెల 16 లోగా ప్రధానోపాధ్యాయుడుకి ఫీజు చెల్లించాలని కోరారు.

విద్యార్థులకు సన్మానం




విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ జింకలవాడలోని సెయింట్ అగతా మోడల్ హైస్కూల్ 10వ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సన్మానించారు. కార్యక్రమంలో ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ సతీష్‌గౌడ్, మూసాపేట డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ సుకృత్ కుమార్, విద్యార్థులు రోహిత్ పాండే, నీరజ్‌కుమార్, అనూష, అంజలి, ఫాతిమా, నాయకులు కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్ : బాచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి చంద్రావతికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆమె.. వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి క్లాస్ రూమ్‌ల నిర్మాణానికి స్థలంలో హద్దులు చూపించాల్సిందిగా ఆర్డీవోని ఆదేశించారు.

సెలవుల్లో హాస్టళ్లను కొనసాగించాలి : ఎస్ఎఫ్ఐ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్: వేసవి సెలవుల సమయంలో కూడా హాస్టళ్లను కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తిక్, ఎస్పీఆర్‌యూ కార్యదర్శి పవిత్ర అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీఆర్ యూనివర్సిటీ వీసీకి, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్ఈటీ, టీపీఎస్సీ, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులు విశ్వవిద్యాలయంలోనే తలదాచుకోగల స్థలాన్ని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు గ్రామాలకు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో తాత్కాలిక హాస్టల్ వసతి అందించడం లేదా తక్కువ ఖర్చుతో షెల్టర్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల అవసరాలు తీర్చినవారవుతారని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భగత్, నాయకులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలో రూ.2కోట్ల 28 లక్షల 50వేలతో నూతనంగా చేపడుతున్న సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. మియాపూర్ డివిజన్‌లోని రెడ్డి కాలనీలో రూ.33.50 లక్షలతో సీసీ రోడ్డు పనులు, కృష్ణసాయి ఎన్‌క్లేవ్ కాలనీలో రూ.40లక్షలతో పార్కు అభివృద్ధి పనులకు, జనప్రియ వెస్ట్ సిటీ కాలనీలో రూ.63.50లక్షలతో సీసీ రోడ్డు పనులకు, ప్రశాంత్‌నగర్ కాలనీలో రూ.43.50 లక్షలతో సీసీ, బీటీ రోడ్డు, న్యూ ప్రశాంత్‌నగర్ కాలనీలో రూ.43లక్షలతో భగత్‌సింగ్ పార్కు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

ఉద్యోగ విరమణ.. సన్మానం

కుత్బుల్లాపూర్: గాజులరామారంలో చిత్తారమ్మ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం డాక్టర్ గజేంద్రబాబు ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరై గజేంద్రబాబు దంపతులను సన్మానించారు. 30 ఏళ్ల సేవలందించి ఈ ప్రాంత ప్రజల మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు



అన్నపూర్ణాదేవి

రాయదుర్గం: గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో ఆలయ14 వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఆదిశంకరాచార్య జయంతిని పురస్కరించుకొని కాశీవిశ్వేశ్వరుడు, అన్నపూర్ణాదేవి, గణపతి, ఆంజనేయస్వామి, షిర్డీసాయిబాబా,ధన్వంతరి స్వామికి అర్చనలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అన్ని విధాలా అభివృద్ధి



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచామని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మనగర్‌లో రూ. 20 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం కార్పొరేటర్ జగన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.3 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేసి ఇటీవల ప్రారంభోత్సవం నిర్వహించామన్నారు. కొందరు నాయకులు ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవంపై చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులంటే అభివృద్ధి కారకులుగా ఉండాలి కాని నిరోధకులుగా ఉండొద్దని హితవు పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, శ్రీ వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, మైసమ్మ నగర్ బీ బ్లాక్ అధ్యక్షుడు బసవప్ప గుప్తా, జనరల్ సెక్రటరీ బండారి రవీందర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఆట!



షటిల్ ఆడుతున్న క్రీడాకారులు



షటిల్ ఇండోర్ కోర్టు

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్ నగర్‌లో ఇండోర్ షటిల్ కోర్టును జీహెచ్ఎంసీ నిర్మించడంపై ఎస్.ఆర్.నాయక్‌నగర్, అపురూపా కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో షటిల్ క్రీడాకారులు ఇక్కడకు వచ్చి షటిల్ ఆడుకుంటున్నారు. గతంలో కాలనీవాసులు షటిల్ ఆడాలంటే బాచుపల్లి, చింతల్, సుచిత్ర వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కాలనీలో సదుపాయం కలగడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. క్రీడాకారులకు మంచినీటితో పాటు టాయిలెట్స్ సదుపాయం కలుగజేస్తే ఇంకా సంతోషంగా ఉంటుందని కాలనీవాసులు అంటున్నారు.

కాలనీ స్థలంలో రూ.3కోట్లతో నిర్మాణం

నవంబర్ 2022లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, కార్పొరేటర్ హేమలతా సురేష్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ సూరిబాబు కాలనీ అసోషియేషన్, కాలనీ ప్రజల ప్రోత్సాహంతో 23 నెలల్లో ఇండోర్ కోర్టు పనులను పూర్తి చేశారు.

ఎకరం స్థలంలో ఇండోర్ స్టేడియం

ఇండోర్ కోర్టు లోపల ఒకేసారి 12మంది క్రీడాకారులు ఆడుకునేల మ్యాటింగ్‌తో మూడు సింథటిక్ కోర్టులను ఏర్పాటు చేశారు. క్రీడాకారుల కోసం కోర్టు లోపల ఎల్ఈడీ లైటింగ్‌లో పాటు టేబుల్ ఫ్యాన్‌లను అమర్చారు. కోర్టుల చుట్టూ క్రీడాకారులు కుర్చీల్లో కూర్చునేలా కొంత మేరకు స్థలాన్ని వదిలారు. 7వేల చదరపు అడుగుల్లో మూడు సింథటిక్ షటిల్ కోర్టులు నిర్మించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే బుకింగ్స్, క్రీడాకారులు ప్రతి నెల కొంత చెల్లించేలా జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి ఒక సిస్టం తీసుకువస్తామని కాంట్రాక్టర్ అన్నారు.

మాటలతో మభ్యపెడుతున్న కాంగ్రెస్

- హామీలను అమలు చేయాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- 225 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మాయ మాటలతో ప్రజలను మభ్యపెడుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి, బాలానగర్ మండలానికి చెందిన 225 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేద ఆడబిడ్డ వివాహమైతే వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో మొదట యాభై ఒక్కవేలను ఇచ్చేవారని, తర్వాత 71 వేలుగా చేసి మళ్లీ లక్షా నూట పదహారు రూపాయలు అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తులం బంగారం ఇస్తామన్నారని, ఇప్పటికీ అది నోచుకోలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి, మందడి శ్రీనివాస రావు, శిరీష బాబురావు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు గౌసుద్దీన్, తహసీల్దార్‌లు శ్రీనివాస్, స్వామి, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 17 మందికి రూ.7.13 లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్‌చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకొని బిల్లులు చెల్లించలేని వారు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హైడ్రా అధికారులతో చెరువు పరిశీలన



హైడ్రా అధికారులతో కలిసి నల్ల చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హైడ్రా అధికారులతో ఎమ్మెల్యే కృష్ణారావు సమావేశమయ్యారు. అనంతరం అధికారులతో కలిసి నల్ల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు, పట్టాదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వారికి తగిన న్యాయం చేస్తూ టీడీఆర్ విషయంలో, సరిహద్దుల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. చెరువుల సుందరీకరణకు తాను ఎప్పుడూ కట్టుబడి ఉంటానని, చెరువులు బాగుంటేనే ఊరు బాగుంటుందన్నారు. భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటే మానవాళి మనుగడ సుభిక్షంగా ఉంటుందని గుర్తు చేశారు.